
కథ

# వర్షాకాలపు ఇరవై ఎనిమిదోరోజు



లెనిన్ ధనిశెట్టి

హత్య-
జరిగి చాలా కాలమయినట్టుంది....
పెచ్చులూడిపోయిన ఈ గదిలో... నా ముందు టేకుకాళ్ల టేబుల్‌పై ఒక ఎర్రటిగుడ్డ కింద అసాధారణంగా ఉబ్బి... పొడుగాటి బస్తాలా....
శవం-
హత్య చేయబడ్డప్పట్నించీ... మాగీ... మాగీ... వుబ్బీ... వుబ్బీ... కుళ్లీ... కడుపులో తిప్పే వెగటు వరచు మదపువాసన.. శవం... తాకితే వేలు దిగబడే బురద... బురదలా శవం నుజ్జునుజ్జై కారుతున్న నీచువాసన శవం...
ఇక ఈ ఎర్రటిగుడ్డను తొలిగిస్తాను..
గప్పున మొహానికి తాకిన దుర్గంధం... తన బెలూన్‌లా ఉబ్బి... కడువు దూదిబస్తాలా... గదంతా మెల్లగా పరచుకుంటున్న దుర్గంధపు పరిమళం.. నాలో?
ఏం చెయ్యాలి నేనిప్పుడు....
పోస్ట్ మార్టమ్-
నెవర్... నావల్లకాదు... నో... నో... నో... ఎలా... అదిలేకుండా... ఎలా తప్పించుకోను. ఒక్కశెలవూలేదు... క్యాజువల్ లీవులన్నీ క్యాబీగా కమలనయనితో... వోహ్.. ముద్దెడుతాను... కసిగా... నా ఫాంటు జేబులోని సర్జికల్ స్పిరిట్ సీసా గాజు పెదాల్ని... చేతులు తిప్పుతున్న సీసామూత విచిత్ర సంగీతం... గొక్క గుక్క
వెచ్చని అమృతపు ఘాటుతనం నా గొంతులోంచి గుండెల్లోకి దిగుతూ... రెండోవాడు నాలోకి ప్రవహించాడు... ఎలాగోలాగా కానిచ్చేస్తానిక... ఎక్కడ కత్తి?... ఎక్కడో భళ్లున వగిలిన నిశ్శబ్దం... 'ఏకో'లో....

000

నెమ్మదిగా కదిలీ... కదిలీ... నావైపు జరుగుతున్న టేకుకాళ్ల శవం టేబుల్... జరిగీ...జరిగీ... నాముందు ఆగింది, కత్తిపడి నా అరచేతిని కావలించుకొంది.. కసిగా. సరిగ్గా అప్పుడు గుర్తించాను నేను శవం చేసిన నవ్వడిని... గాలిలోకి శబ్దాన్ని సెకనులో వెయ్యోవంతులో అనువదించింది నా పురాతన పరిణామ మెదడు నా నరాల్లోని స్పిరిట్‌ని చీల్చుకుంటూ... శబ్దం...
ఆగు...

కత్తిపిడిని రమిస్తోన్న నా అరచేయి అసహనంతో పట్టు విడిల్చినప్పుడు.. నేలకంటుకొంటు కత్తి చేసిన స్టీలు ఆర్తనాదం... ప్రతిధ్వనిస్తూ... నేపథ్యంలో... మాట్లాడుతున్న శవం.
... గ్రీష్మరుతువు ప్రారంభమైన నాలుగురోజుల తర్వాత నా మరణశాసనాన్ని రాసుకొన్నాను. కాంతికోసం పోరాడాను... చిటికెడు వెలుగుకోసం.. చీకటికి వ్యతిరేకంగా... మేఘంతో కలిసి గర్జించాను... కదం తొక్కాను... పదం పాడాను... పోరు... పోరు... నిరంతరపోరు... ఆ మహానగరంలో... ఒక వర్షాకాలపు ఇరవై ఎనిమిదోరోజు... నా వెనుక దిక్కులు పగిలేలా నినాదాలు చేస్తున్న మేఘం... దాని వెనుక పది పిల్లగాలులు... నాముందు... సైన్యం... కాంతి దొంగతాలూకు సైన్యం, దాని వెనుక రాజ్యం మధ్యలో నేను... ఒక గింగిరాలు తిరిగిన ఇనుపవళ్ల ముళ్ల కంచె దాటుతూ... కాల్చుతావా..? కాల్చు... అని ప్రశ్నించిన నా ఛాతికి, గాల్లో గిర్రున తిరుగుతూ వొచ్చిన రాజ్యం బుల్లెట్ జవాబిచ్చింది... నా తల్లి గొంతులో భోరున ఏడుపయ్యాను... నా తండ్రి గుండెలో ఘనీభవించిన దుఃఖానయ్యాను. ఒక నిస్సహాయ మానవకళేబరానయ్యాను... నా వెనుక ప్రశ్నలు కురుపిస్తోన్న మేఘం... నాముందు తుపాకీ నోటితో సమాధానమిస్తున్న రాజ్యం... నిస్సహాయంగా నేలకూలుతూ నేను... గుండెగాయంలోంచి రక్తం కారుతూ... నా కళ్లు

చీకట్లు కమ్ముతూ చీకట్లు... చీకట్లు... నడిరోడ్డుమీద కువ్వకూలాను... కాంతిదొంగ క్షుద్రశక్తి మాయతో వేసిన రోడ్డు నా రక్తాన్ని పీల్చుకుంది... నిలువెల్లా... అలా... కొనవూపిరి కోల్పోతూ మేఘంలో మమేకమయ్యి ఆవేశాన్నయ్యాను... కట్టలు తెంచుకొన్న వుద్రేకానయ్యాను.

ఇంతకీ నేను మరణించింది రాజ్యం బుల్లెట్ తోనా?

కాదు.. కానేకాదు!

అంతకుముందే... ముందే... ఇనువవళ్ల ముళ్ల కంచె దాటుతున్నప్పుడు కొట్టిన కరెంటుషాకుకే... లక్షల వోల్టుల విద్యుత్ ధాటికే...!!!

పవర్ కట్....

శవం మాటలు ఆగిపోయాయి.

గదంతా చిమ్మచీకటి... గుండె మంచుముక్కలా మారిన అనుభూతి.. చెవుల్లో పునరావృతమవుతున్న ఘోష... శవపు ఆత్మఘోష.... ఇక భరించలేను... మీకు తెలుసా? బిలీవిట్ ఆర్ నాట్... శవం మాట్లాడుతుంది... అదీ నిజం మాట్లాడుతుంది... చచ్చినా అబద్ధం చెప్పదు శవం... తాను ఎలా... ఎప్పుడు... ఎందుకు మరణించిందో క్లియర్‌గా చెబుతుంది... అబ్సర్డ్... నాన్సెన్స్... ఇడియాటిక్... హైలీ ఇంపాసిబుల్... మీకర్థంకాదు... తెలివైనవారికి మీకర్థంకాదు... బుద్ధిహీనులకి, నాలాంటివాళ్లకి బాగా అర్థమవుతుంది... వొకే వొక గుక్క... శుద్ధి చేయబడ్డ పరిశుద్ధ ఆల్కహాలు... సర్జికల్ స్పిరిట్... ఇంకో గుక్క... మింగుతాను... మింగాను... రాజ్యం ఆల్కహాలు... మంట... నా మంచుముక్క గుండెను కరిగిస్తూ... బండగా... వెతుకు... కొవ్వొత్తి... వెతుకు... ఆల్మైరాలో... గాజుసీసాల కెమికల్ల వెనుక... కింద అరలో... పాతకత్తులు... కత్తెర్లు... వొందల శవాల్ని ఖండఖండాలుగా కోసి... కోసీ... చిలువు మత్తులో వొత్తుగా... మెత్తగా నిద్రిస్తూన్న సత్యశోధకులు... సగానికి విరిగిపోయి... అందుకో.. బతికించు కొవ్వొత్తిని వెలిగించి... అగ్గిపెట్టె జేబులో వొకేవొక్క వొంటరి అగ్గివుల్ల... యీ అగ్గివ ుల్లను హత్యచేస్తాను... అగ్గివుల్ల మరణించి కొవ్వొత్తిని బతికించింది... వొక బీభత్సకరమైన వెలుగుమంద్రంగా గదంతా పరచుకొంటూ... ఆ వెలుగులో... నెమ్మదిగా వుబ్బుతున్న శవం.. టప్... టప్.. మని పగిలిన శవం కనుగుడ్లు... వుబ్బి... వుబ్బి... వొక్కసారిగా పగిలిన శవం కడుపులోని నీచు గాలికి అల్లల్లాడుతూ... వొణికి... వొణికీ... మరణించిన కొవ్వొత్తి దీపం ప్రవిస్తోన్న చిక్కటి చీకటి... వెలుగులోకి ప్రవహించిన చీకటి... దాని వెనుకనే.. వాసన.. వాసన... పేగులు వాంతయ్యే వాసన... ఎలా వొర్ణించను ఆ వాసనను... భావదారిద్ర్యం... చీకటిలో చూస్తున్న నా కళ్లు పగిలిన శవం కడుపులోంచి పురుగులు... పురుగులు... మిణుగురు పురుగులు.. గుడ్డిగా వెలుగుతూ... వొక్కొక్కటీ పైకెగుర్తూ... కిందపడుతూ... వలయాలు, వలయాలుగా ఎగుర్తూ... చుక్కల్లా చీకట్లో మెరుస్తూ... నిప్పుకణికల్లా... పులికళ్లలా... ఎగుర్తూ... నా చుట్టూ వొకటీ... రెండు... మూడు.... ముప్పై...అరవై... వొందలు.. వేలు... లక్షలు అనంతంగా వొస్తూ...

నా ముందు టేకుకాళ్ల టేబుల్‌పై క్రమక్రమంగా ఆవిరవుతూ అదృశ్యమవుతున్న శవం... పుష్పంలా విచ్చుకొన్న శవం... అదృశ్యమవుతూ...

000

గదిలోని శూన్యాన్ని మింగేస్తూ పురుగులు... మిణుగురు పురుగులు...

శవం పగిలినట్టు... ఈ గది... ఈ గది... ఈ ఇసక ఇటికల సిమ్మెంట్‌గోడల కాంక్రీటు పైకప్పుగది... పగులుతుందేమో... ఈ మిణుగురు పురుగుల ధాటికి...? ఎక్కడ ద్వారము... ఎగ్జిట్... తలుపులు... తలుపులు... తెరువు... తెరువు... గడియలు... ఆమెన్, ద్వారములు తెరచే వున్నవి... పరిగెత్తు... ఎత్తు... ఎత్తువల్లాలు... దుమికీ.. దుంకీ... పరుగెత్తు.. చూడకు, చూడకు... వెనక్కి తిరిగి.. చూడకు ... చూశాను... అమ్మో నన్ను తరుముతున్న మేఘం... ఎర్రగా... జ్వలిస్తూ... నన్ను వెంటాడుతున్న వింత మిణుగురు పురుగుల ఎర్రటి మేఘం... నా కాళ్లకింద పరుగెడుతున్న తార్రోడ్డు... ఇటు... ఇటు... రోడ్డు దిగు... పరిగెడుతున్న మట్టి... ఈ గాఢాంధకారవు కటికచీకటి వాటికలో వదలక నన్ను వెంటాడుతున్న విచిత్ర మిణుగురు మేఘం... గుండెల్లోంచి ఎగదన్నుతున్న భయం... నా కాళ్ల కింద నలుగుతూ పరుగెడుతున్న ఆకులూ, పుల్లలూ, ప్లాస్టిక్ సంచులూ, డిస్పోజబుల్ గ్లాసులూ, సీసాపెంకులూ, ముళ్లూ... ఏవీ... చెప్పలేవీ... ఏవీ... చెప్పు... చెప్పు... పరిగెడుతున్న ఎర్రమట్టి గులక... గులక క్రమంగా ఇసుకగా మారుతూ... ఇసుక... ఇసుకలోకి నా. కాళ్లు కూరుకుపోతూ.. ఎక్కడో.. సన్నగా చెవులను తాకుతున్న ఘోష... క్రమక్రమంగా పెద్దదవుతూ కోట్లవయోలిన్‌ల హోరు...ఈ హోరేమిటీ?....ఒక్కసారి నా కళ్లముందు ప్రత్యక్షమైన అనంతానంత పురాతన అల్లకల్లోలవు విశాల సముద్రవు శ్మశానం... వుద్రేకంతో ఘోషిస్తూ... యుగాలుగా కరుడుగట్టిన ఇసుక తీరాన్ని కెరటాలతో మోదుతూ... దూరంగా తీరం దాటుతున్న తుఫాను... లీలగా.. ఇక భరించలేను ఈ పరుగును... పరుగెత్తు.... ఇలా.. ఈ పక్కకి... అదిగో... అల్లదిగో... సరుగుడు చెట్ల బృందావనం... దాని చీకటి గర్భకుహరంలో దాక్కో... మిణుగురుపురుగుల మేఘానికి కనిపించకుండా దాక్కో... దాక్కొని తీరిగ్గా డోక్కో... అరగని భయపు ఆలోచనలని తీరిగ్గా డోక్కో... నా పాదాల కింద నలుగతోన్న సరుగుచెట్ల ఆకుతివాచీ...

ఎన్నాళ్లకు స్పృశించింది భూమి... నా పాదాలని?

నాకు నేనే కనబడని చీకట్లో నడుస్తూ... నేను!

... అమ్మయ్య... ఇక్కడ చీకటికే కనబడనంత చీకటిగా వుంది ఇక్కడ....

దాక్కొంటాను... యీ చీకటి గర్భకుహరంలో... లో లోతుల్లో... భగవాన్... ఇదేమిటీ... చితిమంటకు రేగుతున్న నిప్పురవ్వల్లా... నిప్పుతోకల తూనిగల్లా... చీకటిని



చీల్చుకుంటూ... అలవోకగా... సరుగుచెట్టుఆకుల సందుల్ని తప్పుకొంటూ... ఇలా వొస్తున్నాయేమిటీ... ఈ మిణుగురుపురుగులు ఒక్కొక్కటీ రాలుతూ... మిణుగురుమేఘం వొర్షించిందా?.... చెట్ల ఆకుల మేకులపై అక్కడక్కడా... మెరుస్తూ... అరుతూ... వెలుగుతూ... వెలుగు మిణుగురుపూల చీకటి వుద్యానవనంలో నేను... థింకర్ విగ్రహంలా... బుగ్గలకు పిడికిలి నానించుకొని ఆలోచిస్తూ... అనంతమైన ఆలోచనతో ఆత్మహత్య చేసుకొంటూ నేను... సరిగ్గా నా చూపు కేంద్రీకృతమయ్యే చోట రాలింది వొక మిణుగురు... రెక్కలార్చుతో తోక దీపాన్ని ఆర్పుతూ... వెలిగిస్తూ... మెల్లగా మాట్లాడసాగింది పెద్ద గొంతుతో...

ఎంత భయం.... ఎంత భయం... ఎందుకలా పరిగెడుతావు.. జంతువులు నయం నీకంటే... బుద్ధిహీనుడా.. విను... ఇంతకూ ఒందరెట్లు భయపడ్డాం నీకంటే... భయం... ప్రాణభయం... ఒక కాంతిదొంగ వాడే... మానవరాజ్యపుకృతక మర్మాంగవయం... కాంతిమీద పన్ను విధించాడు... ఎక్కడా కాంతిలేదు వెలుగులేదు.... చీకటి... చీకటి.. మీరు, మానవులు... కాంతికి బానిసలు కాంతికోసం మీరు రాజ్యాన్ని ఎదిరించలేక మాపైకి దండెత్తారు... కాంతికోసం.. మానవులు... మీరు... మాపై వేట సాగించారు.... పిడికిళ్లు బిగించాల్సిన మీరు మమ్మల్ని బంధించేందుకు పిడికిళ్లు విప్పారు... లక్షల చేతులు మమ్మల్ని వెంటాడాయి. అవి మమ్మల్ని బంధించి రకరకాల గాజుకుప్పెల్లో, సీసాల్లో వుంచాయి... కాంతికోసం... అడవిలోకి ప్రవహిస్తున్న మానవులు మాచుట్టూ వేలాడుతున్న వురితాళ్లు... లక్షల అదృశ్య హస్తాలు... కాంతికోసం... చెట్లని లతల్లా పాక్కుంటూ లక్షల అదృశ్య హస్తాలు... మమ్మల్ని బంధిస్తూ... భయం... ప్రాణభయంతో ఆకాశాన్నంటే చెట్ల ఆకులసందుల్లో దాక్కొన్నం.. మా భయానికి అడవి ఉఛ్వాశ, నిఛ్వాశలు మరిచి వూపిరి బిగబట్టింది... అలా మీరు బందీలుగా పట్టుకొనిపోగా మిగిలిన మేం... వర్షాలు కురవని వొక వర్షరుతువు... ఇరవైఏడోరోజు నాటి ఉదయం... అలల కేకలేస్తూ మండిపడుతున్న సముద్రం వద్దకెళ్లి కన్నీరు కార్చాం... సముద్రం మా కన్నీళ్లు స్వీకరించి మాకో మేఘాన్నిచ్చి, యుద్ధానికి సిద్ధం కమ్మంది...

మా ముందు అనంతమైన వెండిమెరుపుఅంచు మేఘం, గంభీరంగా ఎలా కదిలించాలి మేఘాన్ని... యుద్ధరంగానికి ఎలా?.. మా చిన్న రెక్కలతో గాలి వీచాం... మేఘం నవ్వుకొంది, మార్మికంగా... మరుక్షణంలో... ఎక్కడ్నించొచ్చాయో... పదిపిల్లగాలులు.. వొకటి మూడురంగులది మిగతా తొమ్మిదీ... రకరకాల ఎరుపు మిశ్రమరంగుల్లో... మొత్తం పది పిల్లగాలులు... మా ప్రమేయం లేకుండానే మేఘాన్ని కదిలించాయి, వొక మహానగరం వైపు... గాలిలో తేలుతూ మేఘపు యుద్ధశకటం... క్రమశిక్షణగా.. వెనుక మేము... నిర్లిప్తంగా... సరిగ్గా ఆరోజు అర్ధరాత్రికి మహానగరపు అంచుల్ని చేరాము... ఆ అర్ధరాత్రి ఈ రికామీ పిల్లగాలులు మేఘాన్ని అలా వొంటరిగా నిలువరించి, యుద్ధానికి అనుమతికోసం... అదీ శత్రువు అనుమతికోసం... ఛీ... ఎంత ఘోరం... చర్చలకు వెళ్లాయి. పుత్తచేతుల్తో తిరిగొచ్చాయి... అర్ధరాత్రి దాటింది, వొర్షాకాలపు ఇరవై ఎనిమిదో రోజులోకి ప్రవేశించాం ఆ రాత్రి తెల్లవారలేదు... ఆ రాత్రి చీకటి ఉదయంలోకి ప్రవేశించి ఉదయించింది. చిమ్మచీకటిగా... చీకటి సూర్యుడు ఉదయించాడు....

ఒణుకుతోంది మిణుగురు కంఠం... చలికి కాబోలు...

చలేస్తుందా?.. ప్రశ్నించేను....

"వూ... మ్... హు..' వొణుకు గొంతుతో బదులిచ్చింది మిణుగురు...

నా ఫాంటుజేబులో గువ్వపిట్టలా వొదిగిన స్పిరిట్‌సీసాను అందించేను... దానికి

రెండుగుక్కలు తాగి చెప్పింది, బావుంది... వెచ్చగా... ఇక చెబుతా విను....

చలి నా వూపిరితిత్తుల్ని కొరుకుతున్న ఆ చీకటిలో తీక్షణంగా వినడం ప్రారంభించేను... మిణుగురు చెబుతున్న మిగిలిన కథను....


000

ఎక్కడి పిల్లగాలులివి?... ఎక్కడ్నించొచ్చాయి?... ఏమో?... ఎవరికి తెలుసు? నీకా?... నాకా?... లేని దేవుడికా?... ఎవరికి తెలుసూ?...

కండకస్మాలపు చీకటి వుదయాన ఆ మహానగరపు వుద్యానవనం నుండి మేఘాన్ని బయల్దేరదీశాయి... ఆ పదిపిల్లగాలులు... రాజ్యం ప్రధాన స్థావరంవైపుగా... కాంతిదొంగ తారాడే భవనం వైపుగా... ఘీంకారాలు చేస్తూ నడుస్తున్న మేఘం... మహానగరపు విశాల మార్గాల గుండా... మెల్లగా.. మందంగా... చిక్కగా కదులుతూ... పిల్లగాలులు శంకాలను పూరించేయి నటన వొట్టి నటన... శంకారావానికి వుద్రేకంతో పరవళ్లు తొక్కింది... మేఘం... వొంటరి మేఘం... మెరుపులు మెరిసింది.... వురుములు వురిమింది... వుక్కుగొంతుతో వొక్కపెట్టున ఘీంకరించింది నినాదాల్ని... యంత్రలోకపు బానిసా... మంత్రరాజ్య సైనాధ్యక్ష నశించాలి... నువ్వు నశించాలి.. కాంతిదొంగా... వెలుగుచోరుడా నువ్వు పతనమవక తప్పదు... అంటూ పిల్లగాలులు విచ్చెత్తినట్టు గింగిరాలు తిరిగాయి... నటన... వొట్టినటన... వాటి వెనుక ప్రశ్నల వర్షం కురిపిస్తూ మేఘం ఒక పద్మవ్యూహంలో ప్రవేశిస్తూంది... కాంతిదొంగ రచించిన చీకటి పద్మవ్యూహం... క్రమంగా మేఘాన్ని చుట్టుముడుతున్న అదృశ్యసైనికదళం.. తుపాకులతో... ఇనువలాటీలతో... బాష్పవాయుయంత్రాలతో... నీటుని చిమ్మేవాహనాలతో... అశ్వదళాలతో.. నెమ్మదిగా మేఘాన్ని కమ్ముకొంటున్న... వొక రహస్యకుట్ర.. మేఘం తలని వెంటాడుతున్న అదృశ్యకరవాలం.. ఇవేమీ తెలియని మేఘం మాత్రం పరవళ్లు తొక్కుతూ... చండప్రచండంగా ఆ మహానగరపు వొక చౌరస్తాను చేరింది.. నిండిపోయింది చౌరస్తా మేఘంతో... మేఘం.. ఎటుచూసినా మేఘం.. వొక వొంతెనమీదుగా చౌరస్తాను ఆక్రమించి విశాలంగా మోహరించిన వొంటిరి మేఘం....

అలా వొళ్లుతెలియని ఆవేశంలో నేను వొక ముసలి నాయకుని విగ్రహపు భుజంమీద వాలేను... అతను నన్ను చూసి నవ్వి... 'కాలజ్ఞానం' చెప్పడం ప్రారంభించేడు...

మిణుగురూ... శ్రద్ధగా విను.. ఎనభై సంవత్సరాల క్రితం జరిగిన వొక దుస్సంఘటన కొద్దిక్షణాల తర్వాత రూపాన్ని మార్చుకొని



ఇక్కడ పునరావృత్తమవుతుంది.. రెండూ ఉద్యానవనాలే... పేర్లు మార్పు అంతే... ఈ చెట్లు... వచ్చువచ్చని ఈ చెట్లు... రక్తపుష్పాలను పుట్టిస్తాయి... ఈ వచ్చటి గరిక అంచులకొనలకి రక్తబిందువులు స్పర్శిస్తాయి. వింటున్నావా... రౌలట్. రోల్‌బాక్స్‌లోకి ప్రవహిస్తుంది... అప్పటి తెల్లటి సైన్యాధ్యక్షుడు... ఇప్పుడు నల్లరంగు పులుముకొని ఈ యుద్ధనాటకరంగోద్యాన వనానికి వొస్తాడు... ఎటొచ్చి మేఘం... మాత్రం అదే... తేడాలేదు... అదే దుస్సంఘటన పునరావృత్తమవుతుంది... అంటూ కిందకు దూకి అదృశ్యమయ్యాడు ఆకాశంలో... గాలిలో విభ్రాంతితో ఎగురుతూ నేను... కింద.... అనంతంగా వ్యాపించిన మేఘం... దాని ముందు మార్గం గుండ్రంగా చుట్టుకొని ముళ్లకంచెలా... దానికవతల నాలుగు వొరుసల్లో కాంతిదొంగ సైన్యం... మేఘంలో వొకటోవంతైనా లేని వాళ్ల చేతుల్లో... ఆయుధాలు... ఆకాశంవైపు చూస్తూ...

నిరసన... అణచివేత... రెండూ ఎదురెదురుగా నిలుచున్నాయి...

ఆ నల్లటి సోమవారం మధ్యాహ్నంగా మారుతోంది... నిదానంగా...

మేఘం ముళ్ల కంచె దాటాలని విశ్వప్రయత్నం చేస్తోంది... ఇనుప ముళ్లకంచెను తొక్కుకుంటూ... మేఘం కాళ్లు ప్రవించాయి ఎర్రెర్రటి రక్తాన్ని... మేఘం గీరుకుపోయింది.... అక్కడక్కడా చిరుగులు పడింది... వాదించింది... సైన్యం మేఘాన్ని మెడపట్టుకొని గెంటింది... తోపులాట.. సైన్యం మేఘాన్ని ఇనుపలాటీలతో బాదసాగేరు... అందినచోటల్లా... తొక్కిసలాట... నీటిఫిరంగులు వొర్షించాయి నీటిని కుంభవృష్టిగా... ముద్దముద్దగా తడిసిపోతూ.. మహోద్రేకంతో సైన్యాల మధ్య చొచ్చుకుపోయేందుకు ప్రయత్నిస్తున్న మేఘం... వొక పక్క పిల్లగాలుల్ని మేఘం నుంచి వేరుచేసి, బూటుకాళ్లతో తంతూ... తుపాకీ మడమలతో మోదుతూ...

వొక్కక్షణం అచేతనమయ్యింది నిరాయుధ మేఘం... చుట్టూ పరికించింది... గుడ్డిగా మరుక్షణం పువ్వెత్తున ఎగసింది... ఆకాశానికి... నిలువెల్లా కంపిస్తూ యుద్ధపతాకను అవతల విసిరి క్రతో మెరుపు విన్యాసం చేసింది... అదుపుతప్పిన ఆవేశంతో చేతికందిన వస్తువులు సైన్యంమీదకి విసిరేసింది.... రాళ్లు... చెప్పులు.. క్రముక్కలు గాలిలో రివ్వున తిరుగుతూ.. వొర్షంలా కురుస్తూ... సైన్యంపై. మెరుపుల పురుములతో చెలరేగింది మేఘం... పరుగులు తీశాయి కాంతిదొంగ సైన్యాలు... అటూ.. ఇటూ.. పిచ్చెత్తినట్లు... రెప్పలే లేని కాంతిదొంగకళ్లు రహస్యసంకేతాలని ప్రసారంచేశాయి. ఆ సంకేతాన్ని గ్రహించిన సైన్యం విజృంభించి ఆఖరి అస్త్రం ప్రయోగించింది మేఘంపై. తుపాకులు ధనా... ధనా.. మాట్లాడాయి... బాష్పవాయుగోళాలు హాహాకారాలు చేశాయి. నీటిఫిరంగులు గర్జించాయి.

మేఘం అడిగిన ప్రశ్నలకు అవి జవాబులిచ్చాయి.

బార్కింగ్ డాగ్స్ కెన్ ఆల్సో బైట్ బోర్డు వెనుక....

పాపం.... మేఘం పీలికలుపీలికలయ్యింది... దాని కుడిచెవిలో... ఎడమచేతిలో గిర్రున తిరుగుతూ దిగబడిన బుల్లెట్లు... గుంపులుగుంపులుగా విడిపోతున్న నిస్సహాయమేఘం... మేఘం.. పొట్టలో... నడుముపై బుల్లెట్లు... క్షీణిస్తున్న మేఘం వెండిమెరుపు... దాని కుడిచేతిలో... ఎడమకాలిలో... బుల్లెట్లు... బాష్పవాయుప్రయోగానికి దాని కళ్లు భగాభగా మండుతూ... చూపు మందగించింది... దాని ఇరుభుజాలపై శరపరంపరలా బుల్లెట్లు... నిప్పులు చిమ్ముతున్న నీటి వేగాన్ని చిత్తడిచిత్తడిగా మారి... దాని చేతుల్లో, కాళ్లలో... తొడల్లో... రంధ్రాలు చేస్తూ, చివ్వున రక్తాన్ని చిమ్ముతూ దూసుకుపోతున్న రాజ్యపు ఇనుపబుల్లెట్లు వున్మత్తంగా...పైశాచికంగా... కాంతిదొంగ సైన్యం.. మేఘపు వొంటిపై కదుములు కడుతొన్న ఇనుపలాటీల ముద్రావిన్యాసం... అరుపులు... హాహాకారాలు చేస్తూ... దిక్కుతోచని మేఘాన్ని. తరుముతోన్న అశ్వికదళాలు... గిట్టలకింద నలుగుతో మేఘపు పీలికల గుండెలు. నినదిస్తున్న మేఘం గొంతులోకి దిగబడుతున్న బుల్లెట్లు దాని తలలో....కళ్లలో, మేఘంనుంచి ప్రవహిస్తున్న రక్తాన్ని జుర్రుకొంటూ... ఆర్తిగా పీల్చుకొంటూ రోడ్లు... రోడ్లు... రంధ్రాలుగా మారిన జల్లెడ మేఘం... చివరగా నాలుగు తుపాకులు గర్జించేయి... మేఘం ఛాతీలో మెరుపువేగంతో దిగబడిన నాలుగు బుల్లెట్లు... నాలుగుసార్లు ప్రతిధ్వనించిన వొకే సమాధానం... మేఘం వేసిన వొందలాది ప్రశ్నలకు వొకే సమాధానం చెప్పిన నాలుగు తుపాకులు...

"అస్తిత్వాన్ని నిరసనగా మార్చి రాజ్యంపైకి యుద్ధం ప్రకటిస్తావా? మరణించు...!"

గిలగిలా కొట్టుకుంటూ కుప్పకూలింది మేఘం... పెద్ద కొండచరియలూ.... విరిగిపడింది మేఘం... శకలాలు... శకలాలుగా విడిపోయిన వొంటరి మేఘం... మూకుమ్మడిగా పడ్డారు సైన్యం దానిపై... వారి నల్లటిబూట్ల కింద చితికిపోతున్న మేఘం... ముక్కలయిన రాళ్ల మధ్యా, తెగిపోయిన చెప్పుల మధ్యా... పీలికలైన యుద్ధపతాకాలమధ్యా.. ముక్కలు... ముక్కలుగా రాలిన మేఘపు తుంపరులు... మేఘం... పువ్వెత్తున లేచి... తునాతునకలైన మహాదుఃఖపు కెరటం... మేఘం.. వొక శవం... వొక గాయం... బిగించిన పిడికిలి... అస్తిత్వపు మూలుగు... కాంతిదొంగరాజ్యపు బీభత్సానికి వొక నెత్తుటి సాక్ష్యం... పాపం.. వొంటరి మేఘం....

అలా చంపబడ్డది మేఘం... ఆ నల్లటి సోమవారం సాయంత్రం...

000

మిణుగురు కళ్లలో కన్నీరవుతున్న దిగులు మేఘం... కాంతిదొంగ రాజ్యం నవ్వుకొంది లోలోపల... పైకి ఆవేశపడింది వర్షించాల్సిన మేఘానికి పోరాటం పనికిరాదంది.. మృదు మేఘానికి హింస కూడదంది. జరిగిన ఘోరానికి విచారణలూ... తీర్పూ లేదంది...ఎలా విడుదల చేయాలి వెలుగును రాజ్యం కబంధ హస్తాలనుంచి... ఎలా? నింపాలి... వెలుగుకి మేఘం గుండెల్లో... చీకటి వెలుగవుతుందా? నా చుట్టూ రాజ్యాంధకారం అనంతంగా... ఎవరు ప్రేమిస్తారు? మేఘాన్ని మరణించిన వొట్టి ఆవిరిమేఘాన్ని?

(బ్లాక్ మండేకు సంవత్సరం నిండుతున్నందుకు)

